క్లుప్తంగా

స్టీల్ ఇండస్ట్రీ ప్రారంభం



స్టీల్ ఇండస్ట్రీని పరిశీలిస్తున్న దొరబాబు తదితరులు

సామర్లకోట: స్టీల్ సామాగ్రి అనగానే సామర్ల కోట పేరు గుర్తుకు వస్తుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్టీల్ ఇండస్ట్రీని గురువారం ఆయన ప్రారంభించారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో వివిధ రకాల చిన్న పరిశ్రమలు ఉన్నాయని ఆయన తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ అసోసియేషన్ కార్యదర్శి గంజి బూరయ్య, సొసైటీ అధ్యక్షుడు మేకా శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల సమాచారం ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ పుల్లయ్య

సామర్లకోట: మండల పరిధిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై సమాచారం ఇవ్వాలని ఎంఈఓ 2 పి.పుల్లయ్య అన్నారు. గురువారం స్థానిక మేరీ ఇమాక్యులేట్ స్కూల్‌లో నిర్వహించిన పాఠశాలల హెచ్ఎంల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మౌలిక సదుపాయాల వివరాలతో పాటు పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల వివరాలు, ఆయా తరగతుల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్‌కు చెందిన విద్యార్థుల వివరాలను సమగ్రంగా తయారు చేసి మండల విద్యా శాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందన్నారు. ప్రైవేటు పాఠశాలలో క్వాలిఫైడ్ టీచర్ల వివరాలను తెలియజేయాలని సూచించారు.

కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె

పెద్దాపురం: అంగన్‌వాడీలకు కనీస వేతనాలు అమలు చేయాలంటూ మున్సిపల్ కార్యాలయం వద్ద స్థానిక ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం మూడో రోజు ఆందోళన కొనసాగించారు. 283 అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేసి మోకాళ్లపై నిలబడి దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు టీడీపీ, సీపీఎం నాయకులు మద్దతు పలికారు. సీఐటీయూ నాయకుడు డి.క్రాంతికుమార్, అంగన్‌వాడీ నాయకులు దాడి బేబీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

కొత్తపల్లి: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు గురువారం తెలిపారు. మండలంలోని పోన్నాడ శివారు కోనపాపపేటకు బెనుగు శ్రావణి ఈ నెల 8న గ్రామ జంక్షన్‌లో ఉన్న తమ కిరాణా షాపుకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. అప్పటి నుంచి ఆమె కనిపించకపోవడంతో తండ్రి బెనుగు వెంకట రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు



రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం తగిలిన సత్యవతి

సామర్లకోట: స్థానిక కిర్లంపూడి రోడ్డులో ఈటీసీ లే అవుట్ జగనన్న కాలనీ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం పులిమేరుకు చెందిన దంపతులు సీత అప్పారావు, సత్యవతి మోటారు సైకిలుపై వస్తుండగా వెనుక నుంచి ఆటో ఢీ కొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. సత్యవతి తలకు బలమైన గాయం తగిలింది. క్షతగాత్రులను స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంధనం పొదుపుగా వాడాలి

కాకినాడ రూరల్: మానవ జీవితంలో నిత్యావసరమైన ఇంధన వనరులను పొదుపుగా వినియోగిస్తే భావితరాలకు ఎంతో మేలు కలుగుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో జాతీయ ఇంధన వనరుల పొదుపు దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సహజంగా లభించే ఇంధన వనరులను విచక్షణ రహితంగా వినియోగిస్తే తరిగిపోయి రాబోయే తరాలకు విపరీతమైన కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. సంప్రదాయేతర ఇందన వనరులైన సౌరశక్తి, వాయుశక్తి, జీవవ్యర్థ పదార్థాల శక్తిని వినియోగించాలన్నారు. అడబాల రత్నప్రసాద్, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

దేవుడు వరమిచ్చినా దయ రాదా..

- అన్నదాతల గోడు
- ప్రభుత్వం కొంటామంటున్నా మిల్లర్లు మోకాలడ్డుతున్నారని ఆరోపణ
- ధాన్యంలో తేమశాతం వ్యత్యాసాలపై ఆవేదన



ధాన్యం ఆరబోత, నూర్పిడి చేసుకుంటున్న రైతులు

సామర్లకోట: మిచాంగ్ తుపాను చేసిన పంట నష్టం అన్నదాతను తీవ్రంగా కలచివేసింది. ఏం పర్లేదు. నేనున్నాను అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన భరోసాకు ఆనందించే లోపే క్షేత్రస్థాయిలో మిల్లర్లు నానా ఇబ్బందులు పెడుతున్నారు. దేవుడు వరమిచ్చినా పూజారి మోకాలడ్డినట్టు తయారైంది వారి పరిస్థితి.

తుపాను వెళ్లి ఎండలు రావడంతో రైతులు ధాన్యం రాశులను ఆరబెట్టుకొవడంతో పాటు పనలపై ఉన్న పంటను నూర్పిడి చేసుకుని ధాన్యం విక్రయాలకు సిద్ధం అవుతున్నారు. దీనిలో భాగంగా రైతులకు అందుబాటులో ఉన్న ఆర్బీకేలకు ధాన్యాన్ని తీసుకువెళ్తున్నారు. అక్కడి వీఏఏలు ధాన్యాన్ని పరిశీలించి తేమ శాతం 16, 17గా గుర్తించి మిల్లులకు పంపుతున్నారు. అయితే మిల్లుల్లో తేమ శాతం 19, 20 ఉందని లోడ్‌కు రెండు బస్తాల వరకు కోత విధిస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. సార్వా సీజన్‌లో మండల పరిధిలో 22,500 ఎకరాలల్లో వరి సాగు చేశారు. తుపాన్ నాటికి తొమ్మిది వేల ఎకరాల్లో కోతకు సిద్ధంగాను, మూడు వేల ఎకరాలల్లో పంట నేలకు ఒరిగిన స్థితిలోను, రెండు వేల ఎకరాల్లో పనపై, మూడు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రాశులుగా ఉన్నదని మండల వ్యవసాయాధికారులు ప్రకటించారు. ఇరిగేషన్ అధికారులు డిసెంబరు మొదటి వారం నాటికి దాళ్వా నాట్లు పూర్తి చేయాలని, మార్చిలో గోదావరి కాలువ మూసేస్తారని అధికారులు ప్రకటించారు. దాంతో రైతులు పొలాల్లోని పంటను ఒబ్బిడి చేసుకోవాలని ప్రయత్నిస్తుంటే మిల్లర్ల వేధింపులు పెరిగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రైస్ మిల్లుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్న ధాన్యం లోడు

మిల్లర్ల పరిస్థితి ఇదీ..



మండల పరిధిలో అన్ని రైస్ మిల్లులు ఒకేలా ఉన్నాయి. ఆర్బీకేలో నిర్ధారించిన తేమ శాతంతోనే ధాన్యాన్ని మిల్లుల్లో తీసుకోవాలని అధికారులు చెప్తున్నారు. అయితే మిల్లుల్లో మళ్లీ తేమ శాతం కొలిచి 19 లేదా 20 ఉందని బస్తాకు రెండు కిలోల వరకు తగ్గించేస్తున్నారు. దీంతో లోడుకు మూడు బస్తాలు నష్టపోవాల్సి వస్తోంది. మిల్లు దగ్గరే ఆర్బీకే సిబ్బందితో తేమ శాతం నిర్ధారించే ఏర్పాటు చేయాలి.

– తాటికొండ అచ్చిరాజు, సొసైటీ అధ్యక్షుడు, నవర.

సివిల్ సప్లయ్ అధికారులకే అధికారం



మిల్లర్లపై చర్యలు తీసుకునే అధికారం సివిల్ సప్లయ్ అధికారులకే ఉంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం సమయంలో వారు ఆర్బీకేలో తేమ శాతాన్ని సక్రమంగా నిర్ధారించి రైతుకు ఇచ్చిన సర్టిఫికెట్ ఆధారంగా మిలర్లు తీసుకొంటారని చెప్పారు. రైతుల సమస్యను పారసర్కరా అధికారుల దృష్టికి తీసుకు వెళతాం.

– ఐ సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

వైభవంగా షష్ఠి ఉత్సవాలు ప్రారంభం

- ధగద్ధగాయమానంగా చదలాడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం



షష్ఠి ఉత్సవాల్లో భాగంగా విద్యుద్దీప కాంతుల నడుమ ఆలయం



పెద్దాపురం మండలం చదలాడలో వేంచేసియున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

పెద్దాపురం: జిల్లాలో బిక్కవోలు తరువాత మెట్ట ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన మండలంలోని చదలాడ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు గురువారం ఆట్టహాసంగా ఆరంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్నీ విద్యుద్దీపాలంకరణతో, చలువ పందిళ్లతో కళకళలాడాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా స్వామి వారి దర్శన భాగ్యం కల్గించేలా ఆలయ కమిటీ అన్ని చర్యలు చేపట్టింది. షష్ఠి మహోత్సవాల్లో గురువారం సాయంత్రం భగవద్గీత ప్రచార సమితి వ్యవస్థాపకుడు మల్లికార్జున స్వామిచే 'లక్ష్మి శివ నామస్మరణం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ 15వ తేదీ రాత్రికి రాజమహేంద్రవరానికి చెందిన శ్రీరామ బుర్రకథ బృందంచే 'బుర్రకథ' ప్రదర్శన, 16న 'కోట బొమ్మాళి' ఇంద్రజాల ప్రదర్శన, 17న స్థానిక కళాకారులతో 'కోలాటం', 18న 'ఢీ' డ్యాన్స్ పోటీలు ఉంటాయని ఆలయ కమిటీ తెలిపింది. షష్ఠి రోజైన 18వ తేదీ వేకువ జాము నుంచి ఏలేరు నదీస్నానాలు ఆచరించి స్వామి దర్శన భాగ్యం, ఉత్సవ నిర్వహణ ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 11 గంటలకు దేవుని ఊరేగింపు, రాత్రి భారీ బాణసంచా పోటీలు ఉంటాయన్నారు. ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ హాజరై భాగస్వాములు కావాలని కమిటీ విజ్ఞప్తి చేసింది.

పథకాలపై అవగాహన పెంచుకోవాలి

'వికసిత్ భారత్'లో ఎంపీడీఓ శ్రీలలిత



హుస్సేన్‌పురంలో స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ, అధికారులు

సామర్లకోట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 పథకాలపై అవగాహన పెంచుకొవాలని ఎంపీడీఓ డి శ్రీలలిత అన్నారు. గురువారం వేట్లపాలెం, హుస్సేన్‌పురం గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ మేరకు ఈ పథకాలలో లబ్ధిపొందిన వారి నుంచి సమాచారం సేకరించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కర్రి హరి కృష్ణసత్యారెడ్డి, ఎంఈఓ 2 పి.పుల్లయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జి.పద్మరూప, ఏఓ ఐ.సత్య, సర్పంచ్ చిల్లి వెంకట లక్ష్మి, ఉపసర్పంచ్ గోలి శ్రీరామ్, హుస్సేన్‌పురం సర్పంచ్ మార్ని నాగమణి, బీజేపీ నాయకులు బి.వి శ్వేశ్వరరావు, రాంకుమార్, వి.వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేశారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



యండపల్లిలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. మండలంలోని యండపల్లిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ సమకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. గ్రామ సచివాలయం–2లో అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. సాయిబాబా గుడి వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా అన్నివర్గాల వారికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్, గ్రామ సర్పంచ్ శ్రీలం పెదఅప్పారావు, ఎంపీటీసీ బర్రె రవి, కన్వీనర్లు ఆలపు సుధారాణి, దాసరి సీత, దాసరి లోకేష్, ఈఓపీఆర్డీ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన



మల్లవరంలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

కొత్తపల్లి: మిచాంగ్ తుపాను ప్రభావంతో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు గురువారం పిఠాపురం నియోజకవర్గంలోని గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటించింది. గొల్లప్రోలు మండలంలో మల్లవరం, కొత్తపల్లి మండలం రమణక్కపేటలో పర్యటించిన అధికారులు తడిసిన వరి పనులు, మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించారు. తుపాను ప్రభావం, జరిగిన పంట నష్టంపై రైతులతో చర్చించారు. పలు ప్రాంతాల నుంచి ధాన్యం నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఇండియన్ గ్రేన్ స్టోరేజ్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఐజీఆర్ఎం) టెక్నికల్ అధికారి జి.కిరణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్నామన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయి అధికారి డి.పుష్పమణి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి బీవీఎస్ హరి, ఫుడ్ కంట్రోల్ అధికారులు వి.శివరామాంజనేయులు, వై.శ్రీనివాస్, ఏడీఏ స్వాతి, గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారులు కేవీవీ సత్యనారాయణ, జోగిరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలు పాటించాల్సిందే



పెద్దాపురంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిపిస్తున్న సీడీపీఓ, మేనేజర్



గొల్లప్రోలులో తలుపుల తాళం బద్దలు కొట్టిస్తున్న సెక్టార్ సూపర్‌వైజర్ మానసాదేవి

అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించిన అధికారులు

పెద్దాపురం: ప్రభుత్వ ఆదేశాలను ఉద్యోగులు పాటించాల్సిందేనని ఐసీడీఎస్ సీడీపీఓ జి.ఉష, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మేనేజర్ జ్యోతిరాణి అన్నారు. పెద్దాపురం ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె నేపథ్యంలో గురువారం అంగన్‌వాడీ విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా స్థానిక సచివాలయ సిబ్బందిచే ఆయా కేంద్రాలను తెరిపించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను మాత్రమే అమలు చేశామని, ఉద్యోగులు సహకరించాలని వారు కోరారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుని, ప్రజలకు, ప్రభుత్వ సంస్థలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. సుమారు 130 అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించి విద్యార్థులు, బాలింతలు, గర్భిణులకు సేవలను అందించినట్లు వారు తెలిపారు.

కొత్తపల్లి: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు విధులను బహిష్కరించి కేంద్రాలకు తాళాలు వేసి ఆందోళనలు చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేయడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గంలో మూసివేసిన అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం అధికారులు తెరిపించారు. తాళాలను బద్దల కొట్టి కేంద్రాలను తెరిచారు. వాటి నిర్వహణను సచివాలయ పోలీసులు, స్వయం సహాయ సంఘాలకు అప్పగించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను తెరిపించినట్టు కొత్తపల్లి ఎంపీడీఓ నారాయణస్వామి తెలిపారు.

17న సీజీఎం వార్షికోత్సవం



క్రిస్మస్ వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సుదీప్, సత్యానందం, వీరబాబు

పెద్దాపురం: ఈ నెల 17వ తేదీన నిర్వహించే క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) వార్షికోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్ అన్నారు. మండలంలోని తిరుపతి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో గురువారం నంగిన సత్యానందం, శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సుదీప్ మాట్లాడుతూ సేవా పరిచర్యను ప్రారంభించి 11వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సత్యానందం మాట్లాడుతూ ఈ నెల 17తో పాటు 21, 25, 26, 28, 29 తేదీల్లో దివిలి, తిరుపతి, చదలాడ, కాండ్రకోట, పిఠాపురం మండలం విరవ, పులిమేరులోని శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలల్లో క్రిస్మస్ వేడుకలను నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం ఆయా క్రిస్మస్ వేడుకల కరపత్రాలను వారు ఆవిష్కరించారు.

అచ్చంపేటలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు



అచ్చంపేటలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సౌమ్యశ్రీ

శంఖవరం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు వైద్యం చేరువైందని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. మండలంలోని అచ్చంపేటలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సౌమ్యశ్రీ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. కౌమార దశలో ఉన్న యువతుల్లో రక్తహీనత ఉంటే ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వర్షకాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. 60 మంది సాధారణ రోగులు, 10 మంది గర్భిణులు, ఇద్దరు బాలింతలు, 50 మంది మధుమేహ బాధితులు, 60 మంది రక్తపోటుతో బాధపడుతున్న వారికి సేవలు అందించామని వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గౌరీదేవికి సారె సమర్పణ

ప్రత్తిపాడు: కిర్లంపూడి మండలం జగపతినగరంలో గౌరీదేవి అమ్మవారికి సారె సమర్పణ మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. గౌరీదేవి ఉత్సవ కమిటీ ప్రతినిధులు కర్రి సూర్యకుమార్, ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో మహిళలు, యువతులు తమ ఇళ్లలో వండిన పలురకాల వంటకాలు, మిఠాయిలు, పండ్లు తదితర నైవేద్యాలను శిరస్సున దాల్చి, సారెతో శోభాయాత్ర (గ్రామోత్సవం) నిర్వహించారు. జగపతినగరం, కొండయ్యపేట, కొత్త కాలనీ, యల్లపు వారి వీధి, సోమరాజుపేట, మెయిన్‌రోడ్డు మీదుగా కిర్లంపూడి నూకాలమ్మ అమ్మవారి ఆలయం వరకూ ఈ యాత్ర కొనసాగింది. మహిళలు తిరిగి జగపతినగరం గౌరీదేవి అమ్మవారికి ఆలయానికి చేరుకుని, నైవేద్యాలను సమర్పించారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వేర్వేరుగా అమ్మవారికి సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో యంగ్‌మెన్స్ క్లబ్ అధ్యక్షుడు పెంటకోట నాగబాబు, సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబీ, గ్రామ సర్పంచ్ గుడాల శ్రీలతరాంబాబు, చదరం చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైద్యంతోనే వ్యాధుల నివారణ

గండేపల్లి: ప్రకృతి వైద్యంతోనే వ్యాధుల సమూల నివారణ సాధ్యమని గోవిందపురానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు గొట్టిముక్కల వెంకటపల్లి సుబ్బరాజు (నాని) తెలిపారు. మండలంలోని నీలాద్రిరావుపేటలో ఆయుర్వేద హెర్బల్ షాపును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తమ పూర్వీకుల నుంచి గత ఏడు తరాలుగా ఈ ఆయుర్వేద వైద్యం చేస్తున్నామన్నారు. వ్యాధుల నివారణకు ఆయుర్వేదం ఎంతో మేలన్నారు. ప్రజలు ఈ ఆయుర్వేద షాపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, పార్టీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్త కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఆందోళన



పిఠాపురంలో ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

పిఠాపురం: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ భూ సమస్యలను పరిష్కరించకపోగా వివాదాలకు, వాజ్యాలను కారణం అవుతోందని పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు అన్నారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పిఠాపురం కోర్టు ఆవరణలో ఆందోళన చేశారు. గత 15 రోజులుగా విధులను బహిష్కరించి న్యాయవాదులు ఆందోళన చేస్తున్నారు. కార్యక్రమంలో అలీ, బంగారు రామకృష్ణ, మూర్తి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గోరింటలో మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

పెద్దాపురం: మండలంలోని గోరింట గ్రామంలో ఆల్ ఇండియా క్రిస్టియన్ అధ్యక్షుడు రిక్కీ గూటం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. స్థానిక క్రీస్తు సంఘం, కృపానిధి ఫౌండేషన్ నిర్వహించిన శిబిరాన్ని ట్రినిటీ ఆసుపత్రి డైరెక్టర్ రిక్కీ గూటం, ప్రముఖ వైద్యులు కిషోర్, స్టీఫెన్ ఆనంద్‌లు ప్రారంభించారు. సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా కేన్సర్ పరీక్షలు, ఎక్స్‌రే, డయాబెటీస్, దంత, కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యులు విజయ్‌మోహన్, మురళి, రాజా, రామచంద్ర, కరుణ, ఆర్గనైజర్ రాజేంద్రప్రసాద్, కో–ఆర్డినేటర్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: శంఖవరం మండలం వజ్రకూటంలో సారా స్థావరాలపై ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్ – ఎస్ఈబీ) సిబ్బంది గురువారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. సంఘటన స్థలం నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, నిందితుడు పిల్లా శ్రీనుపై పరారీ కేసు నమోదు చేశామన్నారు. అనంతరం గ్రామంలో పరివర్తన కార్యక్రమం నిర్వహించారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోటనందూరు: అక్రమంగా నిల్వ చేసిన 1500 కేజీల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సురేష్‌బాబు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఇండుగపల్లికి చెందిన లౌడు శివ ఓ ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ చేశాడనే ముందస్తు సమాచారంతో విజిలెన్స్, సివిల్ సప్లయి అధికారులు సంయుక్తంగా దాడి చేశారు. అక్రమంగా నిల్వ చేసిన బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిపై 6ఏ కేసు నమోదు చేశారు. విజిలెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, సివిల్ సప్లయి డీటీ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

గోకవరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోలవరం నిర్వాసితులు గురువారం గోకవరంలో నిరసన దీక్ష చేపట్టారు. దేవీపట్నం ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన పలువురు నిర్వాసితులు గ్రామ సర్పంచ్ కుంజం రాజమణి ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ దీక్షకు మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, సీతంశెట్టి వెంకటేశ్వరరావు మద్దతు తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై త్వరలో రంపచోడవరం ఐటీడీఏ పీఓ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తామని తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఏలేశ్వరం: మహిళలు ఆర్థికంగా ఎదగాలని మున్సిపాల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను మెప్మా మార్కెట్ ద్వారా విక్రయిస్తారన్నారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ సాయికుమార్, ఆర్పీలు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

కోటనందూరు: దివ్యాంగ చిన్నారులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సూచించారు. స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలోని నాన్ భవిత కేంద్రంలో గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రతి వారం దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలతో పాటు, నాణ్యమైన ఆహారం, డిజిటల్ విద్యను ప్రభుత్వం అందిస్తోందన్నారు. అనంతరం దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీపీ శ్రీనివాసు ఆర్థిక సహాయంతో దివ్యాంగ చిన్నారులు, వారి తల్లిదండ్రులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఏబీ మండలాధ్యక్షుడు సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గరిసింగు దొరబాబు, దార్ల సూర్యచంద్ర, ఎంపీడీఓ శర్మ, ఎంఈఓలు శ్రీనివాస్, రామశేఖర్, ఐఈడీఎస్ కమలకుమారి, ఐఈఆర్పీలు నాగగోవిందు, నారాయణరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల దీక్ష

గోకవరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం నిరసన దీక్ష చేపట్టారు.